సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 2 । ఆగస్టు । 2024



బిర్యానీ తిన్న విద్యార్థులకు అస్వస్థత

చికెన్ బిర్యానీ తిన్న ఎస్.కోట, అనంతగిరి, పాచిపెంట, అరకు, మారికవలసలకు చెందిన విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. 8లో



అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

అంకితభావంతో పనిచేస్తే ప్రజల్లో ఎప్పటికి మంచి గుర్తింపు ఉంటుందని బదిలీ అయిన ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే చెప్పారు. 8లో



ఘాట్‌రోడ్డులో కూలిన చెట్టు

మారేడుమిల్లి–చింతూరు ఘాట్ రోడ్డులో అడ్డంగా గురువారం చెట్టు కూలి పడింది. దీంతో ట్రాఫిక్ జామ్ అయింది. 8లో

న్యూస్‌రీల్

నెల రోజులుగా వీడని వర్షాలు



వై.రామవరంలో కురుస్తున్న కుండపోత వర్షం

వై.రామవరం: మండలంలో నెల రోజులుగా ప్రతిరోజు వర్షం కురుస్తుండడంతో ప్రజలు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. తెల్లవారు జామున ప్రారంభమై ఉదయం గంటల 11 వరకు వర్షం కురుస్తుండడంతో పొలం పనులకు కూలీలు రావడంలేదు. దీంతో వ్యవసాయ పనుల జరగడం లేదు. నాట్లు ముందుకు సాగక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

జీవవైవిధ్యాన్ని పెంపొందించాలి

- జేసీ అభిషేక్‌గౌడ్



మొక్క నాటుతున్న జాయింట్ కలెక్టర్

ఎటపాక: పర్యావరణాన్ని పరిరక్షించి, జీవవైవిధ్యాన్ని పెంపొందించాలని జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ్ అన్నారు. లక్ష్మీపురంలో ఐటీసీ సహకారంతో సొసైటీ ఫర్ సంపూర్ణగ్రామ స్వరాజ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం రైతులకు ఉచితంగా పండ్ల జాతి,నీడనిచ్చే మొక్కలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మొక్కలు నాటిన అనంతరం జేసీ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని తెలిపారు. గ్రామాలను పచ్చదనంతో నింపడం వల్ల జీవవైవిధ్యాన్ని కాపాడుకోవచ్చని చెప్పారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ శేఖర్,ఎంపీడీవో మురళీకృష్ణ, రేంజర్ మూర్తి, ఏవో రాబిన్‌సుదర్శన్, ఐటీసీ బంగారు భవిష్యత్తు మేనేజర్లు జయప్రకాష్, సాగర్, స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కృష్ణకిషోర్,ప్రాజెక్ట్ కోఆర్డినేటర్లు సతీష్, గణేష్, ఆర్గనైజర్లు నాగేశ్వరరావు,రజాక్, ఎంపీటీసీ పాయం దేవి,గ్రామపెద్ద రంభాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.


ఏవోబీలో విస్తృతంగా కూంబింగ్



వై.రామవరం మండలం మీదుగా అటవీప్రాంతంలోకి వెళుతున్న పోలీసులు

వై.రామవరం: మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో వారంరోజులుగా మండల సరిహద్దు అటవీ ప్రాంతం (ఏవోబీలో)లో కూంబింగ్ కొనసాగుతోంది. దీనిలో భాగంగా గురువారం వై.రామవరం మీదుగా సరిహద్దు అటవీ ప్రాంతంలోకి భారీ ఎత్తున పోలీసు బలగాలు ప్రవేశించాయి. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని వై.రామవరం, గుర్తేడు, డొంకరాయి, సరిహద్దు పాంతమైన దుశ్చర్తి పోలీసు స్టేషన్ల పరిధిలోని ప్రధాన రహదారుల్లో ఆయా స్టేషన్ల ఎస్ఐల ఆధ్వర్యంలో గురువారం విస్తృతంగా వాహనాలు తనిఖీ చేశారు.

వరదనీటిలో పడి వ్యక్తి మృతి



రాజయ్య మృతదేహం

చింతూరు: పశువులు తెచ్చేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు వరదనీటిలో పడి పూసం రాజయ్య(64) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన చింతూరు మండలం ఉలుమూరులో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రాజయ్య, వీరయ్యకు చెందిన పశువులు మేత మేసేందుకు వరదనీటిని దాటుకుని అవతలి ఒడ్డుకు వెళ్లాయి. వాటిని తెచ్చేందుకు ఇద్దరూ కలిసి వరదనీటిలో అవతలి ఒడ్డుకు వెళుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు రాజయ్య వరదనీటిలో పడి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ అగరం సుబ్బలక్ష్మి సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులు, జాలర్ల సాయంతో పడవపై గాలింపు చర్యలు చేపట్టగా రాజయ్య మృతదేహం లభ్యమైంది.

అభాగ్యులపై నిర్దయ

అభాగ్యుల పాలిట కూటమి ప్రభుత్వం నిర్దయగా వ్యవహరిస్తోంది. పింఛన్ సొమ్ముపై ఆధారపడి జీవిస్తున్న వారికి గుండెకోత మిగులుస్తోంది. ఖజానాపై భారం తగ్గించుకునేందుకు పేదల జీవితాలను పణంగా పెడుతోంది. ఒకే సారి పింఛన్‌దారులను తగ్గిస్తే వ్యతిరేకత వస్తుందన్న మోసపూరిత ఆలోచనతో నెలనెలా కొంతమంది చొప్పున కోత విధిస్తోంది.

- రెండో నెలలోనూ పింఛన్లకు కోత
- ఇప్పటి వరకు 918 మంది పెన్షన్‌దారులపై వేటు



సాక్షి, పాడేరు: కూటమి ప్రభుత్వం పింఛన్లలో కోతలు ప్రారంభించింది. వరుసగా రెండో నెలలో కూడా వేటు వేసింది. పింఛన్ల భారం తగ్గించుకునే కుట్రలతో భాగంగా పలు కారణాలు చూపడంతో పాటు తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా లేరన్న అక్కసుతో స్థానిక నేతల ఒత్తిళ్లతో కొంత మంది పేరు తప్పించారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఎన్నికల ఫలితాల ముందు వరకు పింఛన్లు అందించిన అధికారులు.. ఈ రెండు నెలల్లో కుంటిసాకులు చూపించి కొంత మంది పేర్లు తప్పించడం గమనార్హం. దీంతో ప్రతి నెలా పెన్షన్‌దారుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. ముున్ముందు భారీగా సామాజిక పెన్షన్లలో కోత విధించే అవకాశాలు ఉన్నట్లు సంకేతాలు వస్తున్నాయి.

918 మంది పింఛన్‌దారులపై వేటు

జిల్లాలో జూలై నెలలో 1,27,064 మందికి పింఛన్లు పంపిణీ చేయవలసి ఉండగా 1,26,813 మందికి అందజేశారు. 251 మందికి పింఛన్ మంజూరు చేయలేదు. అదే ఆగస్టు నెలలో 1,26,813 మందికి పింఛన్ మంజూరు చేయవలసి ఉండగా 1,25,946 మందికి మంజూరు చేశారు. అంటే 867 మందిపై వేటు వేశారు. ఈ గణాంకాల ప్రకారం కేవలం రెండు నెలల్లోనే 918 మంది లబ్ధిదారులపై వేటు వేసినట్లు స్పష్టంగా తెలుస్తోంది. అయితే ఈ తగ్గింపు వెనుక సాంకేతిక కారణాలు చూపించడానికి అధికారులు అష్టకష్టాలు పడుతున్నారు. ఏవో కారణాలు చెప్పి తప్పించుకొనే ప్రయత్నం చేస్తున్నారు.

భారం తగ్గించుకోడానికే..

ఎన్నికల్లో గెలిచేందుకు చంద్రబాబు అలవికానీ హామీలు గుప్పించారు. రూ.3 వేలు ఉన్న పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచుతానని హామీ ఇచ్చేశారు. తీరా అధికారం చేపట్టాక అది భారంగా పరిణమించినట్టు అర్థమైపోయింది. దీంతో కొంత భారాన్ని తగ్గించుకోవాలన్న నిర్ణయానికి వచ్చారు. మరో వైపు తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా లేరన్న అనుమానం ఉన్న వారి పేర్లు తప్పించాలని భావిస్తోంది. ఫలితంగా ఈ రెండు కారణాలతో భారీగా లబ్ధిదారుల సంఖ్యలో కోత విధించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. నిబంధనలను మరింత కఠినతరం చేసి లబ్ధిదారుల సంఖ్య తగ్గించుకోవడం ద్వారా భారాన్ని తగ్గించుకునే ప్రయత్నాలు ఉన్నట్టు సంకేతాలు వస్తున్నాయి. ఇప్పటికే అనధికారికంగా వడపోతకు అవసరమయ్యే ప్రక్రియను ప్రారంభించినట్టు తెలుస్తోంది. త్వరలోనే దీనికి సంబంధించి విధి విధానాలు ప్రకటించే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది.

నడి వీధిలో .. నిల్చోబెట్టి



బల్లుగూడ పాఠశాల ఆవరణలో సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

- ఊరంతటికీ ఒకే చోట పింఛన్ల పంపిణీ
- అవస్థలు పడిన వృద్ధులు

సాక్షి,పాడేరు: పెన్షన్ల పంపిణీ విధానం పండుటాకులను మళ్లీ అవస్థలకు గురిచేస్తోంది. ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినా జిల్లాలో చాలా ప్రాంతాల్లో అమలుకాలేదు. నడి వీధిలో... దుకాణాలు, పాఠశాలలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల వద్ద గంటల తరబడి నిలుచోబెట్టి పంపిణీ చేశారు. దీంతో పలువురు వృద్ధులు తీవ్ర అవస్థలకు గురయ్యారు. ఈ పరిస్థితిని చూసిన కొందరు లబ్ధిదారులు నిట్టూర్చారు. గత ప్రభుత్వం హయాంలో కడుపులో చల్లకదలకుండా పింఛను పొందేవారమని, ఇప్పుడు ఈ దురావస్థదాపురించిందని వాపోయారు.

సామాజిక పింఛన్ల పంపిణీని రెండు రోజుల్లోనే పూర్తి చేయాలని రాష్ట్ర ఆదేశించడంతో జిల్లా వ్యాప్తంగా సచివాలయం ఉద్యోగులు గురువారం ఇంటింటికి వెళ్లకుండా ఊళ్లో ఉన్న పింఛన్ దారులందరినీ ఓ చోటికు రప్పించి, నగదు పంపిణీ చేశారు.జిల్లా కేంద్రం పాడేరుతో పాటు పలు గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు ఇదే విధంగా పింఛన్లు పంపిణీ చేశారు. గురువారం రాత్రి 9గంటల సమయానికి 1,21,150 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్టు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. కలెక్టర్ దినేష్‌కుమార్ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.పాడేరు మండలం గుత్తులపుట్టు సచివాలయం పరిధిలో పలువురు లబ్ధిదారులకు కలెక్టర్ పింఛన్ సొమ్మును పంపిణీ చేశారు.

మాతాశిశు మరణాలు సంభవిస్తే కఠిన చర్యలు

కలెక్టర్ దినేష్‌కుమార్



వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలో మాతాశిశువుల మరణాలు సంభవించినా,మలేరియా జ్వరాలతో గిరిజనులు మృతి చెందినా బాధ్యులైన వైద్యసిబ్బందిపై చర్యలు తీవ్రంగా ఉంటాయని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ హెచ్చరించారు.కలెక్టరేట్‌లో వైద్యాధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల ప్రాణాలు కాపాడవలసిన బాధ్యత వైద్యశాఖపై ఉందని చెప్పారు. మలేరియా నివారణ కార్యక్రమాలు జరుగుతున్నా కేసులు నమోదవడం,మరణాలు చోటుచేసుకోవడం బాధాకరమన్నారు.వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.గత నెలలో గెమ్మెలి,హుకుంపేట, గౌరిదేవిపేట పీహెచ్‌సీల్లో ముగ్గురు తల్లులు మరణించడంపై కలెక్టర్ ఆరా తీశారు. సరైన వైద్యం అందక మరణాలు సంభవించినట్టు నిర్ధారణ అయితే ఉపేక్షించేది లేదన్నారు.మలేరియా జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని,దోమల నివారణ మందు పిచికారీతో పాటు వైద్య ఆరోగ్య కార్యక్రమాలను విస్తృతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో పద్మావతి, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా,జిల్లా మలేరియాశాఖ అధికారి తులసి,పాడేరు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర,డీసీహెచ్ డాక్టర్ కృష్ణారావు పాల్గొన్నారు.

టీడీపీ పాలనపై తీవ్ర ప్రజావ్యతిరేకత

రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



అడ్డతీగల: రాష్ట్రంలో టీడీపీ పాలనపై తీవ్ర ప్రజా వ్యతిరేకత వ్యక్తమవుతోందని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరిట అలవికాని హామీలిచ్చి అధికారం చేపట్టిన రెండు నెలల్లోనే ప్రజావ్యతిరేకత మూటగట్టుకున్న చరిత్ర కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చింది మొదలు రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోందని తెలిపారు. ప్రజలతో పాటు ప్రతిపక్ష పార్టీల నాయకులపై దాడులు నిత్యకృత్యమయ్యాయన్నారు. అధికారం చేపట్టిన తరువాత చంద్రబాబు నాయుడు హామీల అమలుపై చేతులెత్తేశారని చెప్పారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబుకి రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం ఎంతో తెలియదా అని ప్రశ్నించారు. కరోనా కష్ట కాలంలో సైతం సంక్షేమ పథకాలను నిరంతరాయంగా అమలుచేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఆమె చెప్పారు. చిన్నారులపై అత్యాచారాలు జరుగుతున్నా మంత్రులు పట్టించుకోవడం లేదని, కనీసం బాధితులను పరామర్శించడం లేదన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై దుష్ప్రచారం చేశారని, చంద్రబాబు పచ్చ పత్రికల్లో అబద్ధాలు ప్రచారం చేయించి ప్రజలతో మైండ్ గేమ్ ఆడారని ఆరోపించారు. ఇప్పటికైనా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో అరాచకాలను ఆపివేసి శాంతియుతమైన పరిపాలన ద్వారా ప్రజాసంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

గిరిజన యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలి

సాక్షి,పాడేరు: జిల్లాలో గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధి రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇవ్వాలని, ఆసక్తి గల వారిని శిక్షణకు ఎంపికచేయాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం జిల్లా నైపుణ్య కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల్లో ఉపాధి లభించే రంగాల్లో శిక్షణ ఇస్తే ఎంతో గిరిజన యువతకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.వ్యవసాయ రంగంలో యంత్రాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో వాటి మరమ్మతులపై శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులతో చర్చించి నివేదిక తనకు అందజేయలని తెలిపారు.ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ మురళీ,జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రశాంత్,జిల్లా పరిశ్రమల మేనేజర్ సంగీత,పాలిటెక్నిక్,ఐటీఐ ప్రిన్సిపళ్లు సుజాత,వెంకటేశ్వరరావు,డిగ్రీ కళాశాల అధ్యాపకుడు గౌరిశంకర్‌లు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం

గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కన్నబాబు



అధికారులతో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కన్నబాబు



హాజరైన అధికారులు

పాడేరు : గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.కన్నబాబు అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన పాడేరులో పర్యటించారు. ఐటీడీఏ కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో డోలి మోతలు లేకుండా చేయాలని, అన్ని గ్రామాలకు రహదారులు నిర్మించి రవాణా వ్యవస్థ మెరుగుపర్చాలన్నారు. ఐటీడీఏలో అమలవుతున్న పథకాలపై ఆయన చర్చించారు. రహదారులు, అత్యవసరమైన వంతెనలు, కల్వర్టుల నిర్మాణాలు, కాఫీ ప్రాజెక్టు విస్తరణపై ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాల్లో విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలన్నారు. అటవీ హక్కుల చట్టం ద్వారా పరిష్కరించాల్సిన క్లయిమ్‌లు, మన్యంలో చేపడుతున్న వివిధ పథకాల పురోగతి, బిల్లుల చెల్లింపుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ కాఫీ, పసుపు ప్రాజెక్టుల అమలు, రహదారులు, చెక్ డ్యాంల నిర్మాణాలు, అటవీ హక్కుల చట్టం అమలు, జల్ జీవన్ మిషన్ ద్వారా నిర్మించిన తాగునీటి పథకాలు, ఆరోగ్య సేవలు తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఐటీడీ ఆధ్వర్యంలో సికిల్‌సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలు, ప్రాజెక్టు లక్ష్య పేరిటా సివిల్స్ కోచింగ్, సూపర్ ఫిఫ్టీ ద్వారా టెన్త్ విద్యార్థులకు అందిస్తున్న ప్రత్యేక శిక్షణ గురించి వివరించారు. జనమన్ పథకం ద్వారా ఎనిమిది వేల గృహాలకు విద్యుత్ సౌకర్యం కల్పించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవోలు వెంకటేశ్వరరావు, ప్రభాకర్‌రావు, టీడబ్ల్యూ ఈఈలు డీవీఆర్ఎం రాజు, వేణుగోపాల్, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని సాధించేలా శిక్షణ

విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాధించేందుకు దోహదపడేలా శిక్షణ ఉండాలని గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కె. కన్నబాబు సూచించారు. మండలంలోని గుత్తులపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు సూపర్ ఫిఫ్టీ కార్యక్రమం ద్వారా అందిస్తున్న ప్రత్యేక శిక్షణను పరిశీలించి, విద్యార్థులతో ముచ్చటించారు. భవిష్యత్‌లో ఎవరెవరు ఏమవుతారని ఆయన ప్రశ్నించగా ఎక్కువ మంది విద్యార్థులు తాము డాక్టర్ అవుతామని చెప్పడంతో ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వం, ఐటీడీఏ అందిస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలని వారికి సూచించారు. ఉన్నత లక్ష్యాలను చేరుకుని పాడేరు ఏజెన్సీ ప్రాంతానికి మరింత గుర్తింపు తేవాలన్నారు. ఆయన వెంట ఐటీడీఏ పీవో అభిషేక్, టీడబ్ల్యూ డీడీ కొండలరావు, ఐటీడీఏ ఏపీవోలు ప్రభాకర్‌రావు, వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

దంతేవాడ వరకే కిరండూల్ రైళ్లు

తాటిచెట్లపాలెం(విశాఖ): కేకే లైన్‌లో నెలకొన్న ప్రతికూల వాతావరణం కారణంగా ఈ మార్గంలో నడిచే ప్రయాణికుల రైళ్లను ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి 7వ తేదీ వరకు విశాఖపట్నం–కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం–కిరండూల్(18514) ఎక్స్‌ప్రెస్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తాయి. ఈ నెల రెండు నుంచి 8వ తేదీ వరకు కిరండూల్–విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్, కిరండూల్– విశాఖపట్నం (18513) ఎక్స్‌ప్రెస్ దంతేవాడలో బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటాయి. ఈ తేదీల్లో ఈ రైళ్లను దంతేవాడ–కిరండూల్ మధ్య రద్దు చేశారు. ప్రయాణికులు ఈ మార్పులను గమనించాలని ఆయన కోరారు.

అడవుల పరిరక్షణ అందరి బాధ్యత

స్క్వాడ్ డీఎఫ్‌వో త్రిమూర్తులరెడ్డి



బడదనాంపల్లి రక్షిత అటవీ ప్రాంతంలో టేకు వనాలను పరిశీలిస్తున్న స్క్వాడ్ డీఎఫ్‌వో త్రిమూర్తులరెడ్డి

రాజవొమ్మంగి: అడవులను పరిరక్షించవలసిన బాధ్యత అందరిపై ఉందని రాజమహేంద్రవరం జోన్–2 స్క్వాడ్ డీఎఫ్‌వో ఎ.త్రిమూర్తులరెడ్డి తెలిపారు. రాజవొమ్మంగి అటవీక్షేత్రంలోని బడదనాంపల్లి రక్షిత అటవీప్రాంతానికి చెందిన కంపార్టమెంట్ నంబర్ 511లో టేకు వనాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ వనాలు హార్వెస్టింగ్‌కు (నరుకు పనులకు) దగ్గరపడ్డాయని, వచ్చే ఏడాది నుంచి దశలవారీగా నరికే పనులు చేపడతామన్నారు. ఈ ప్రాంతంలో 1965లో నాటిన 75.6 హెక్టార్లలో టేకు వనాలు ఉన్నాయన్నారు. అలాగే 1966లో నాటిన చెంది 12 హెక్టార్లు, 1967కు చెందిన 77.6 హెక్టార్లలో బాగా పెరిగిన టేకు చెట్లు ఉన్నాయని చెప్పారు. ఇదే ప్రాంతంలో గత ఏడాది 10 హెక్టార్లలో నాటిన టేకు తోటను పరిశీలించారు. అనంతరం ఉర్లాకుల పాడులో అటవీశాఖకు చెందిన సెంట్రల్ నర్సరీలో పెంచుతున్న టేకు మొక్కలను చూశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అడవుల సంరక్షణకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట స్థానిక ఎఫ్ఎస్‌వో అబ్బాయిదొర, ఎఫ్ఎస్‌వో రాము, బడదనాంపల్లి ఎఫ్‌బీవో నాగేశ్వరరావు, బేస్‌క్యాంపు సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీ నుంచి ప్రభుత్వ బడికి..

- 9,474 మంది చిన్నారులకు పాఠశాలల్లో ప్రవేశాలు
- సత్ఫలితాలిస్తున్న గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కృషి



అంగన్‌వాడీ చిన్నారులను చింతపల్లిలోని పాఠశాలలో చేర్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

సాక్షి,పాడేరు: అంగన్‌వాడీల్లో విప్లవాత్మక మార్పులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కేంద్రాల్లో చిన్నారుల విద్యాభివృద్ధికి గత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. అంగన్‌వాడీల్లో విద్యనభ్యసించిన చిన్నారులు ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలు పొందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల నుంచి 9,474మంది చిన్నారులు సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవల చేరారు.ఈ విద్యాసంవత్సరంలో పాఠశాలల ప్రారంభం నుంచి అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు,ఇతర సిబ్బంది చిన్నారులకు ఐదేళ్ల ధ్రువీకరణ పత్రాలను జారీ చేసి దగ్గరుండి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించిన కార్పొరేట్ సౌకర్యాలను చూసిన తల్లిదండ్రులంతా తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చదివించేందుకు ఆసక్తి చూపారు.అడ్డతీగల మండలంలో 534, అనంతగిరిలో 407,అరకులోయలో 714, చింతూరులో 375,చింతపల్లిలో 449,డుంబ్రిగుడలో 522, జీకే వీధిలో 831,జి.మాడుగులలో 781,గంగవరంలో 173,హుకుంపేటలో 589,కొయ్యూరులో 782, కూనవరంలో 384,ముంచంగిపుట్టులో 600, మారేడుమిల్లిలో 577,పాడేరులో 180,పెదబయలులో 516, రాజవొమ్మంగిలో 299, రంపచోడవరంలో 327, ఎటపాక మండలంలో 434 మంది అంగన్‌వాడీ చిన్నారులకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించారు.ఐసీడీఎస్ అధికారులు,అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లిదండ్రుల సమక్షంలో చిన్నారుల ప్రవేశాలను ఓ పండగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు.

ప్రవేశాలు కల్పించాం



అంగన్‌వాడీ కేంద్రాలలోని ఐదేళ్ల చిన్నారులందరినీ ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించాం.అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ధ్రువీకరణపత్రాలను జారీ చేయడంతో వాటి ఆధారంగా ఉపాధ్యాయులు చిన్నారులను పాఠశాలల్లో చేర్చుకున్నారు. తల్లిదండ్రులంతా పాఠశాలల్లో ప్రవేశాలకు పూర్తిస్థాయిలో ఐసీడీఎస్‌కు సహకరించారు.

– సూర్యలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ,పాడేరు

పడుతూ లేస్తూ.. బడికి..



పెదబయలులో బురదలో నడుచుకుంటూ వెళుతున్న ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

రోజూ బురదలో విద్యార్థుల నడకయాతన

పెదబయలు: స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల–2 విద్యార్థులు ప్రతి రోజు బురదతో అవస్థలు పడుతున్నారు. సీతగుంట సమీపంలోని ఆశ్రమ పాఠశాలకు వెళ్లే మట్టి రోడ్డు ఇటీవల వర్షాలకు పూర్తిగా బురదమయంగా మారింది. విద్యార్థులు ఇదే మార్గంలో రోజూ జారుతూ... పడుతూ.. ఫీట్స్ చేస్తూ స్కూల్‌కు వెళ్లవలసి వస్తోంది. ఈ పాఠశాల విద్యార్థులే కాకుండా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇదే పాఠశాలలో హాస్టల్ సదుపాయం ఉండడంతో రెండు పాఠశాలల విద్యార్థులు ఈ బురద రోడ్డులో ప్రయాణం చేయాల్సి వస్తోంది. సీతగుంట పాఠశాల జంక్షన్ నుంచి ఆశ్రమ బాలుర పాఠశాల–2 వరకు సీసీ రోడ్డు నిర్మించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

క్లుప్తంగా

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

రంపచోడవరం: ప్రజాసేవలో అంకితభావంతో పనిచేస్తే ప్రజల్లో ఎప్పటికి మంచి గుర్తింపు ఉంటుందని రంపచోడవరం ఐటీడీఏ పీవోగా పని చేసి పల్నాడు జిల్లాకు జాయింట్ కలెక్టర్ గా బదిలీ అయిన సూరజ్ గనోరే చెప్పారు. బదిలీపై వెళ్తున్న పీవోను స్థానికులు కొమ్ము డ్యాన్సులతో, గిరిజన నృత్యాలతో డబ్బుల వాయిద్యాలతో పీవో బంగ్లా నుంచి ఐటీడీఏ కార్యాలయం మీటింగ్ హాలు వరకు ర్యాలీ చేపట్టారు. వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు సిబ్బంది, గిరిజనులు ఆయనను వీడ్కోలు పలికేందుకు స్వచ్ఛందంగా భారీ సంఖ్యలో తరలివచ్చారు. గజమాలతో సన్మానించారు. పీవోగా సుదీర్ఘ కాలం పనిచేసి గిరిజనులకు అందించిన సేవలను వివిధ శాఖల అధికారులు కొనియాడారు. ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్డులో కూలిన చెట్టు

- మూడు గంటల పాటు నిలిచిన వాహనాలు
- ట్రాఫిక్‌కు అంతరాయం


కూలిన చెట్టును తొలగిస్తున్న సిబ్బంది

మారేడుమిల్లి : కురుస్తున్న వర్షాలకు మారేడుమిల్లి–చింతూరు ఘాట్ రోడ్డులో అడ్డంగా గురువారం చెట్టు కూలి పడింది. దీంతో ఇరువైపులా ఆర్టీసీ బస్సులు, వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులు, వాహనచోదకులు రోడ్డుపై పడిగాపులు కాస్తు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుమారు మూడు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. అనంతరం చెట్టును సిబ్బంది తొలగించడంతో రాకపోకలు యధావిధిగా సాగాయి.

పదవి కన్నా సేద్యమే మిన్న...


సేంద్రియ వ్యవసాయ సాగు గురించి సర్పంచ్ జయమ్మ, సన్యాసినాయుడుకు అవగాహన చేస్తున్న మండల వ్యవసాయాధికారి వాసుదేవరావు


వ్యవసాయ భూమిలో కూలీలతో వరినాట్లు వేస్తున్న సాగరం సర్పంచ్ కోట్ని జయమ్మ

- భర్తకు చేదోడుగా వ్యవసాయ పనుల్లో సర్పంచ్ జయమ్మ

మాడుగుల రూరల్ : రాజకీయ పదవులు అంటే నేడు హంగు, ఆర్భాటంతో మెలుగుతున్నారు. అయితే తాను ఒక గ్రామ పంచాయతీకి ప్రథమ పౌరురాలిని అనే హంగు, ఆర్భాటం లేకుండా తాను చేస్తున్న వ్యవసాయ వృత్తిలో భర్తకు చేదోడుగా నిలుస్తోంది అ గ్రామ సర్పంచ్. మండలంలో సాగరం గ్రామ సర్పంచ్‌గా 2021 ఫిబ్రవరి 9వ తేదీన కోట్ని జయమ్మ సర్పంచ్ ఎన్నికల్లో గెలుపొందారు. ఈ పంచాయతీ జనరల్ మహిళకు రిజర్వేషన్ కావడంతో అమె పోటీ చెయ్యడానికి అవకాశం ఏర్పడింది. ఎన్నికలల్లో పోటీ చేసి భారీ మెజార్టీతో సమీప అభ్యర్థిపై అమె భర్త వైఎస్సార్ సీపీ నాయకుడు కోట్ని సన్యాసినాయుడు సహకారంతో జయమ్మ సర్పంచ్‌గా గెలిపొందారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన జయమ్మ తమకు వున్న 6 ఎకరాలు భూమిని వారే సొంతంగా వ్యవసాయం చేసుకుంటున్నారు. సర్పంచ్ అయినా సరే అమె నిత్యం వ్యవసాయ పనుల్లో తన భర్తకు చేదోడు, వాదోడుగా నిల్చి ఆదర్శప్రాయంగా నిలుస్తుంది. సర్పంచ్ అంటే హంగు, ఆర్భాటంతో తిరిగే నేటి రాజకీయాల్లో జయమ్మ ఆదర్శ మహిళగా చెప్పక తప్పదు. ప్రస్తుతం జరుగుతున్న ఖరీఫ్ వరినాట్లు వేసే పనిలో అమె తన పంట పొలంలో మహిళా కూలీలతో సమానంగా పనిచేస్తుంది. వరినారు తియ్యడం, వరినాట్లు వేయడంతో పాటు, వరి కోతలు చేపట్టడం, వరిచేను మోత పనుల్లో పాల్గొంటుంది. దీంతో పాటు వరి కుప్పలు పెట్టేడప్పుడు భర్త సన్యాసినాయుడుకు ఎంతో సహకారం అందిస్తుంది.

ప్రకృతి వ్యవసాయం పద్ధతులు ద్వారా తమకు వున్న 6 ఎకరాలు భూమిని సాగు చేస్తున్నారు. తద్వారా అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవగాహన పర్చడానికి మండల వ్యవసాయాధికారి వాసుదేవరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కూడా క్షేత్ర స్థాయికి వచ్చి అవగాహన పరుస్తున్నారు. సర్పంచ్ అనే ఆర్భాటం లేకుండా తన వృత్తికి కూడా న్యాయం చేస్తున్న సర్పంచ్ జయమ్మను అందరూ అభినందిస్తున్నారు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

నాకు చిన్నప్పటి నుంచి వ్యవసాయం అంటే ఎంతో ఇష్టం. నేను గ్రామ సర్పంచ్ అయినా సరే నేను నమ్ముకున్న వృత్తిని ఎప్పుడూ వదిలి పెట్టం. భర్త సహకారం, పంచాయతీ ప్రజల ఆదరణతో నేను సర్పంచ్‌గా గెలుపొందాను. సర్పంచ్‌గా గ్రామంలో పారిశుధ్యం, వీధి దీపాల ఏర్పాటు, తదితర పనుల్లో చేపడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాను.

–కోట్ని జయమ్మ గ్రామ సర్పంచ్, సాగరం, మాడుగుల మండలం

జెడ్పీ చైర్‌పర్సన్ దృష్టికి పంచాయతీ సమస్యలు


జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్, సర్పంచ్‌లు

హుకుంపేట: ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రను గురువారం అరుకు నియోజకవర్గ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగం రమేష్, హుకుంపేట మండల సర్పంచ్‌లు గురువారం ముంచంగిపుట్టులోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నేపథ్యంలో మండలంలోని పంచాయతీల్లో నెలకొన్న డ్రైనేజీలు, సీసీ రోడ్లు, తాగునీరు తదితర సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. పలు గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను తెలియజేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన పంట పొలాలకు గిరిజనులకు త్వరగా నష్ట పరిహారం అందేలా చూడాలని వినతిలో కోరారు. తుపానుకు కొట్టుకుపోయిన కల్వర్టులు, చెక్‌డ్యామ్‌లకు మరమ్మతులు చేయించేలా చూడాలని వినతిలో పేర్కొనారు. సర్పంచ్‌లు వెంకట్, మోహన్‌దాసు, చందనపాత్రుడు, నాయకులు శివాజీ తదితరులు పాల్గొన్నారు.

60 కిలోల గంజాయి స్వాధీనం


గంజాయితో పట్టుబడిన శివకుమార్

కొయ్యూరు: ఆటోలో తరలిస్తున్న 60 కిలోల గంజాయిని మండలంలో కినపర్తి పంచాయతీ భీమవరం చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ రామకృష్ణ గురువారం తెలిపారు. రంపుల ప్రాంతం నుంచి వస్తున్న ఆటోను తనిఖీ చేయగా దానిలో రెండు గోనెసంచుల్లో 60 కిలోల గంజాయి బయటపడిందన్నారు. చింతపల్లి మండలం కోరుకొండకు చెందిన గెమ్మెలి శివకుమార్, చింతపల్లికి చెందిన మైనర్ బాలుడును అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకుని ఆటోను సీజ్ చేసినట్టు చెప్పారు.

చిత్తులాట ఆడుతున్న 12 మంది అరెస్ట్

మూలపేట పంచాయతీ కొండసంత సమీపంలో చిత్తులాట ఆడుతున్న 12 మందిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. అక్కడ 23 మంది చిత్తులాట ఆడుతుండగా తాము దాడి చేశామని చెప్పారు. అయితే తమను చూసి 11 మంది పరారయ్యారని తెలిపారు. అక్కడ ఉన్న తొమ్మిది బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ చెప్పారు.

సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం


ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు చిన్నబాబు


రాజవొమ్మంగిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు బుజ్జిబాబు

రాజవొమ్మంగి/గంగవరం: ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు హర్షం వ్యక్తం చేస్తూ రంపచోడవరం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఎస్సీ వర్గీయులు గురువారం సంబరాలు జరుపుకున్నారు.ప్లకార్డులతో ర్యాలీలు నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రాజవొమ్మంగిలో జరిగిన కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు బుజ్జిబాబు, ఎంఎస్‌పీ ఉపాధ్యక్షుడు యోహాను, సభ్యులు శివ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. గంగవరంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు చిన్నబాబు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

‘అగ్నివీర్’ ఓ చక్కని అవకాశం


అవగాహన కల్పిస్తున్న ఆఫీసర్ సందీప్

యలమంచిలి రూరల్ : భారత ప్రభుత్వం సైన్యంలో చేరడానికి అమలు ప్రవేశపెట్టిన అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా అగ్నివీర్ వాయుసేన రిక్రూట్‌మెంట్ ప్రక్రియ, ఎంపికైన యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై గురువారం యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విశాఖ వాయుసేన విభాగం నాన్ కమాండింగ్ ఆఫీసర్ సందీప్ విద్యార్థులకు అగ్నివీర్ వాయుసేన విభాగానికి నిర్వహించే ఎంపిక ప్రక్రియ, ఎంపికైన తర్వాత అభ్యర్థులకు ఇచ్చే శిక్షణ, శిక్షణ పూర్తయిన అభ్యర్థులకు భారత వాయుసేనలో వచ్చే ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. అగ్నివీర్ వాయుసేనకు ఎంపికైన అభ్యర్థులకు నాలుగేళ్ల శిక్షణ అనంతరం 25 శాతం అగ్నివీరులకు వాయుసేనలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని, మిగిలిన వారికి చక్కని నగదు ప్రోత్సాహకం ఇస్తారన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల్లో 10 శాతం కోటా ఉంటుందని తెలిపారు. శిక్షణ కాలంలో అభ్యర్థులందరికీ మంచి నైపుణ్యంతో డిగ్రీ పూర్తి చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. అగ్నివీర్ వాయుసేన భర్తీ, ఇతర అంశాలకు సంబంధించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యార్థులకు తెలియజేశారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ అవకాశాన్ని ఆసక్తి గల యువకులంతా సద్వినియోగపర్చుకోవాలని సూచించారు.

కడుపు నొప్పితో ఆశ కార్యకర్త మృతి

- చంపాపుట్టులో విషాదఛాయలు
- మృతురాలు పోర్తిమ్మ సేవలపై గ్రామస్తుల హర్షం


పోర్తిమ్మ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

ముంచంగిపుట్టు: మండలంలో మారుమూల రంగబయలు పంచాయతీ చంపాపుట్టు గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త వంతాల పోర్తిమ్మ(46) గురువారం తీవ్రమైన కడుపు నొప్పితో మృతి చెందింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.లబ్బూరు పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తున్న పోర్తిమ్మ ఆస్పత్రికి మందులు తీసుకొని వచ్చేందుకు సిద్ధం అయింది. బయలుదేరే సమయంలో కడుపు నొప్పి వచ్చింది. కుటుంబ సభ్యులతో మాట్లాడుతూకడుపు నొప్పిని భరించలేక పోతున్నా అంటూ ఆవేదన, ఆత్రంతో మృతి చెందినట్టు పోర్తిమ్మ మృతి చెందింది. నిత్యం అందరిని ఆరోగ్యంపై చైతన్యం పరుస్తూ వైద్య సేవలు అందించే పోర్తిమ్మ మృతితో చంపాపుట్టు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ విషయం తెలుసుకున్న వైస్ ఎంపీపీ భాగ్యవతి, ఆమె భర్త దేవలు చంపాపుట్టు వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు.కుటుంబానికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆశ కార్యకర్త పోర్తిమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆమె కోరారు.

సీ కేడెట్ కార్ప్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ సిటీ: విశాఖ యూనిట్ సీ కేడెట్ కార్ప్స్‌లో చేరేందుకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఇంగ్లిష్‌లో ప్రావీణ్యమున్న 10 నుంచి 12 ఏళ్ల మధ్య (2012 ఆగస్టు 1 నుంచి 2014 జూలై 31) గల 5, 6, 7 తరగతులు చదువుతున్న బాలబాలికలు దరఖాస్తులు చేసుకోవచ్చు. ఈ నెల 4వ తేదీ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఐఎన్ఎస్ సర్కార్స్ కమాండ్ స్విమ్మింగ్ పూల్ వద్ద దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి. దరఖాస్తు తీసుకునేందుకు అభ్యర్థులు ఏదైనా గుర్తింపు కార్డు, స్టడీ సర్టిఫికెట్, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు అందించాలి. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 11వ తేదీ ఉదయం 8 నుంచి 11 గంటల మధ్య అదే వేదిక వద్ద సమర్పించాల్సి ఉంటుంది. ఈ నెల 18న అభ్యర్థులకు రాత, శారీరక, మౌఖిక పరీక్షలు నిర్వహిస్తారు. ఎంపిక సమయంలో విద్యార్థులు వారి స్కూల్ యూనిఫాం ధరించి తల్లిదండ్రులతో కలిసి రావాల్సి ఉంటుంది. ఎంపికైన అభ్యర్థులకు సెప్టెంబర్ 8లోగా కాల్ లెటర్లను వారి చిరునామాలకు పంపిస్తారు. అదే నెల 15 నుంచి శిక్షణ ప్రారంభమవుతుంది. ఎంపికైన వారికి ప్రతీ ఆదివారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్క్వాడ్ డ్రిల్, రైఫిల్ డ్రిల్, రైఫిల్ షూటింగ్, స్విమ్మింగ్, బోట్ పుల్లింగ్, బ్యాండ్, సెమాఫోర్, రిగ్గింగ్, సీమాన్‌షిప్ వంటి వాటిలో శిక్షణ ఇస్తారు. స్వీయ క్రమశిక్షణతో జీవిత లక్ష్యాలను సాధించడానికి ఈ శిక్షణ దోహదపడనుంది. అలాగే రక్షణ దళాల్లో అవకాశాలను అందిపుచ్చుకోడానికి కూడా సహాయపడుతుంది.

బిర్యాని తిన్న 21 మంది విద్యార్థులకు అస్వస్థత

- ఇద్దరి పరిస్థితి విషమం
- కేజీహెచ్‌కు తరలింపు


ఎస్.కోట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

గంట్యాడ: చికెన్ బిర్యాని తిన్న పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో కేజీహెచ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే... గంట్యాడ మండలం కరకవలస గ్రామంలోని ప్రేమవెలుగు సేవా సంస్థ ఆశ్రమంలో ఎస్.కోట, అనంతగిరి, పాచిపెంట, అరకు, మారికవలస ప్రాంతాలకు చెందిన 46 మంది విద్యార్థులు ఆశ్రయం పొందుతూ కరకవలస, రామవరం, పాఠశాలల్లో చదువుతున్నారు. ఈ నెల 30వ తేదీ రాత్రి విద్యార్థులకు నిర్వాహకులు చికెన్ బిర్యాని పెట్టారు. అది తిన్న తర్వాత ఇద్దరు విద్యార్థులకు వాంతులు, విరేచనాలు కావడంతో నిర్వాహకులు ఘోషా ఆస్పత్రికి తరలించారు. 31వ తేదీ ఉదయం మరో నలుగురికి వాంతులు విరేచనాలు కావడంతో వారిని కూడా ఘోషా ఆస్పత్రిలో చూపించిన తర్వాత వారి తల్లిదండ్రులను పిలిపించి ఇంటికి పంపించారు. వారిలో 21 మంది విద్యార్థులకు మళ్లీ వాంతులు, విరేచనాలు ప్రారంభం కావడంతో ఎస్.కోట ఆస్పత్రిలో గురువారం వారి తల్లిదండ్రులు చేర్పించారు. వీరిలో మజ్జి సన్యాసమ్మ (9), జన్ని నవ్య (13)ల పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు.

విద్యార్థులను పరామర్శించిన డీఎంహెచ్ఓ

ఎస్.కోట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు గురువారం పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పూర్తిగా కోలుకున్న వరకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను డీఎంహెచ్ఓ ఆదేశించారు.

ఆశ్రమాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్

విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారనే విషయం తెలుసుకున్న వెంటనే తహసీల్దార్ నీలకంఠేశ్వర రెడ్డి, డీఎంహెచ్ఓ భాస్కరరావు కరకవలసలో ఉన్న ప్రేమ వెలుగు సేవా సంస్థ ఆశ్రమాన్ని తనిఖీ చేశారు. ఎంత మంది విద్యార్థులు ఉంటున్నారు, ఎలాంటి ఆహారం తీసుకున్నారన్న వివరాలు నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహం నిర్వహణ అనుమతులపై ఆరా తీశారు. వసతి గృహ నిర్వహణకు అనుమతులు లేవని తెలిసింది. దీనిపై విచారణకు హాజరు కావాలని తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి నోటీస్ ఇచ్చారు. ప్రాథమిక నివేదికను కలెక్టర్‌కు అందించినట్టు తహసీల్దార్ తెలిపారు.

‘ఇన్‌స్టా’.. ఇంటికి చేర్చింది

- కరీంనగర్ నుంచి విశాఖ వచ్చేసిన యువకుడు
- మతిస్థిమితం లేక రోడ్లపైనే జీవనం
- బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం
- చికిత్స అందించి కుటుంబ సభ్యుల చెంతకు..


రమేష్‌ను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావు, షెల్టర్ మేనేజర్ మమత

విశాఖ విద్య: మతి స్థిమితం లేక ఇంటి నుంచి బయటకు వచ్చేసిన వ్యక్తి నాలుగు నెలల తర్వాత ఇన్‌స్టా గ్రామ్‌లో కనిపించడంతో బంధువులు పట్టరాని ఆనందంలో మునిగితేలారు. విశాఖలోని జీవీఎంసీ షెల్టర్‌లో ఉన్నాడని తెలుసుకున్న వారు కరీంనగర్ జిల్లా కోరుట్ల గ్రామం నుంచి వార్డు కౌన్సిలర్ సహాయంతో గురువారం ఇక్కడకు వచ్చారు. అతన్ని తమ వెంట తీసుకెళ్లారు. వివరాల్లోకి వెళితే. నాలుగు నెలల కిందట గాజువాక సింధియా సమీపంలో ఓ వ్యక్తి మతిస్థిమితం లేక.. ఫుట్‌పాత్‌పై తిరుగుతున్నాడు. ఈ సమాచారం తెలుసుకున్న బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత అక్కడకు చేరుకుని.. అతనికి సపర్యలు చేసి షెల్టర్‌కు తీసుకొచ్చారు. రమేష్ అని తప్పితే.. మినహా మరే ఇతర వివరాలు చెప్పకపోవడంతో షెల్టర్‌లోనే ఆశ్రయం కల్పించారు.

మానసిక వైద్యశాలలో చేర్పించి చికిత్స అందించారు. తర్వాత హైదరాబాద్‌లో తెలిసిన వ్యక్తి ప్రేమ్‌కుమార్ సాయంతో రమేష్ వివరాలను షెల్టర్ మేనేజర్ మమత ఇన్‌స్టా గ్రామ్‌లో పోస్ట్ చేయించారు. రమేష్ కుటుంబ సభ్యులు దీన్ని చూసి ఆమెకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. కానీ వారు వైజాగ్ వచ్చి రమేష్ తీసుకువెళ్లడానికి ఆర్థిక పరిస్థితి లేకపోవడంతో అక్కడి కౌన్సిలర్ సూర్యనారాయణకు విషయాన్ని తెలియజేశారు. దీనిపై స్పందించి రమేష్‌ను తీసుకెళ్లేందుకు వారితో సహా ఆయన గురువారం విశాఖ వచ్చారు. పోలీసులు సమక్షం రమేష్ తమ కుటుంబ సభ్యులును గుర్తు పట్టాడు. దీంతో జీవీఎంసీ అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావు సమక్షంలో రమేష్‌ను కుటుంబ సభ్యులకు అప్పగించారు. తప్పిపోయిన ఎంతో మంది అభాగ్యులకు ఆశ్రయం కల్పిస్తూ.. వారి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చేలా శ్రద్ధ తీసుకుంటున్న అధికారులకు కౌన్సిలర్ సూర్య నారాయణ ధన్యవాదాలు తెలిపారు.